ఓంశ్రీసాయిరాం.

సత్యధర్మప్రేమశాంతులు లేకున్న
విద్యలన్నియు నేర్చి విలువ సున్న
సత్యధర్మప్రేమశాంతులు లేకున్న
దానధర్మాల సార్థకత సున్న
సత్యధర్మప్రేమశాంతులు లేకున్న
పదవులనేలిన ఫలము సున్న
సత్యధర్మప్రేమశాంతులు లేకున్న
బహుళ సత్కార్య లాభంబు సున్న
ఈ సనాతన ధర్మ హర్మ్యంబు నిలువ
గుణములియ్యవి నాలుగు గోడలప్ప
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

దివ్యాత్మస్వరూపులారా!

దేశవిదేశజనులను అయోమయస్థితిలో ముంచివేస్తున్న సమస్యలు ప్రతిరంగములోను కనుపించును. అయిననూ, వాటిని ఎదుర్కొని ఆ రంగములను పుష్టివంతముగా, ఉపయోగకరంగా తీర్చిదిద్దుటకు ప్రయత్నించవలసియున్నది. విద్యాక్షేత్రమందు పతనోన్ముఖముగా పయనించుచున్న ప్రాచీన సంస్కృతిని పరిష్కారముచేసి జీవితములో సామరస్యము, సమన్వయము, సమత్వములను అభివృద్ధిగావించవలసి ఉన్నది. విద్యయొక్క అంతరార్థము ఏమిటని తెలుసుకోవాలి. అంతఃకరణమును పరిశుద్ధపరచేదే విద్య. నైతిక, ధార్మిక శీలసంపదను అభివృద్ధిగావించే విధానమే విద్య. ఏది చీకటి, ఏది వెలుతురు అన్న వివేచనను పెంపొందించి, నిరూపించేదే విద్య. కేవలం గ్రంథములను చదువుట, వ్రాయుట విద్య కానేరదు. అది గ్రంథవిద్య మాత్రమే అగును. ప్రత్యక్షజ్ఞానం లేక, పరోక్షజ్ఞానానికి విలువ సున్న. పరోక్షజ్ఞానాన్ని ప్రత్యక్షజ్ఞానముతో జోడించి లోకకల్యాణానికి వినియోగపెట్టాలి. కానీ, నేటి విద్య పూర్తి యాంత్రికంగా కనిపిస్తున్నది. దీనిలో ఎలాంటి చైతన్యమూ లేదు, నైపుణ్యము లేదు. మానవత్వములోని దివ్యత్వాన్ని ప్రబోధించే అవకాశం మచ్చుకైనా కనిపించటం లేదు. చేతులకు మట్టికాకుండా, ఇస్త్రీ గుడ్డలు నలుగకుండా ఏ మార్గమందైనా అధిక లాభార్జనచేయటం నేటివిద్యయొక్క పరమార్థముగా మారిపోయినది. కష్టించి, శ్రమించి, చెమటార్చి, నిద్రాహారములు మాని సంపాదించేది విద్యయొక్క సారమని దానియొక్క దృక్పథము మారాలి. నేటి విద్య ప్రతి వ్యక్తిని ఇంద్రియాలకు దాసుడినిచేసి, త్యాగములేని స్వార్థపరుడుగా, అసూయాపరుడుగా తయారుచేయుచున్నది. ఉద్యోగము విద్యయొక్క పరమోద్దేశ్యము కాదు. యోగమే నిజమైన గురి. నీతినిజాయితీతో సంబంధములేని శిక్షణక్రమమును తొలగించి, విద్యావంతులలో వినయవిధేయతలు, సేవామనోబావము, దైవప్రీతి, పాపభీతి అభివృద్ధిచేసి వాటివలన ప్రతి ఇంటినీ తేజోవంతముగా మార్చాలి.

విద్యారంగము ఈనాడు అయోమయ స్థితిలో ఉన్నది. ఎక్కడ చూచినా సమస్యలు. మానవజీవితంలో నిత్యసత్యముగా ప్రకాశించే, నిత్యనూతనముగా వెలుగొందే ప్రాచీన సాంప్రదాయాలను, భారతసంస్కృతిని దేశకాలానుగుణ్యంగా సంస్కరించటం వలన ఈ సమస్యలను తీర్చిదిద్దవచ్చు.

ముఖ్యముగా, పరదేశీయుల అనుకరణాభిలాష భారతీయుల పెద్దదుర్యోగము. ప్రపంచములో విజ్ఞానపథమందు పయనిస్తూ అధికులమని విఱ్ఱవీగే రష్యా, అమెరికా దేశాలకంటే మన దేశములో వేదకాలమందే అధికమైన అభివృద్ధి జరిగింది. భారతీయులు అథర్వణవేదం ఆధారంగా పరదేశీయులు ఎన్నో వాజ్ఞానిక పరిశోధనలు చేయుచున్నారు. యంత్రశక్తి, అణుశక్తి, తంత్రశక్తి, మంత్రశక్తులన్నీ అథర్వణవేదములో వివరింపబడినాయి. పాశ్చాత్యులు విమానం కనిపెట్టడానికి కొంతవరకు అథర్వణ సూక్తులు దోహదంచేసినవి. 'పక్క ఇంటి పప్పు రుచి' అన్నట్లు రానురాను విదేశీయుల అనుసరణ ఎక్కువ అయి వారి సంస్కృతి, వారి జీవనతత్త్వమే భారతీయులకు ప్రియమై పెరుగుచున్నది.

1903 డిసెంబర్ 17న అమెరికాదేశంలో రైట్‌సోదరులు విమానం కనిపెట్టారు. కానీ, అంతకు ముందుగానే 1896 సెప్టెంబర్ 13న జర్మనీ దేశస్తుడు దీనిని కనిపెట్టాడు. అంతకుముందుగా 1895 ఆగస్టు 14న మన భారతీయుడు బొంబాయికి చెందినవాడు, వామన్ బాపూజి అనేవాడు విమాన నిర్మాణమును సూచించాడు. కానీ, విమాన పరిశోధనలో బారతీయుని పేరు రాకపోవటానికి కారణము మనలోని అసూయ, దుర్బుద్ధి, అనైక్యతలే కారణము.

అందుకే నేడు అన్ని క్షేత్రములలోను ఐకమత్యము అత్యవసరము. అలాగే, మానవత్వాన్ని పెంపొందించే గుణములుకూడా అభివృద్ధికావాలి. కావలసినవి డిగ్రీలు కావు. విద్యనార్జించేది డిగ్రీలుకోసమనే వెఱ్ఱిని విడిచిపెట్టి, సేవకావృత్తికై జంకక, స్వీయదేశీయ సౌబాగ్యాన్ని తెలుసుకొని ప్రకృతివిద్యలను నేర్చుకోవాలి. యువకులలో ఎంత శక్తి ఉన్నా బలహీనులవలె బ్రతుకుతూ కాలమును వృధాచేస్తున్నారు. ఐక్యత వలన ఆనందమును, ఆనందము వలన పవిత్రతను సంపాదించుకోవాలి. యువకులకు సహనము చాలా ముఖ్యము.

క్షమ సత్యము క్షమ ధర్మము
క్షమ యోగము క్షమయహింస క్షమ యజ్ఞమగున్
క్షమయాచారము క్షమ దయ
క్షమయే ఆధారమగును సర్వంబునకున్.

క్షమ, ప్రేమ రెండూ ఒకే గుణమునందున్న రెండు ముఖాలు మాత్రమే.
నేటి విద్య వినయవిదేయతలను పెంచక అహంకారాన్ని, అసూయను పెంచుతున్నది. విద్య అంటే వెలుగు, కాంతి, తేజస్సు.

దానివలన దొరకవలసినది గ్రంథపరిచయము కాదు, అనుభవజ్ఞానమే! వ్యక్తికి సమాజమునకు గల సంబంధాన్ని గుర్తింపజేసేది, మనలోని పాత అనుభవాలను కొత్త అనుభవాలకు చేర్చి, సమన్వయంచేసి నైతిక ప్రవర్తనను పెంపొందింపజేసేదే జ్ఞానము.

మితిమీరిన ధనము మతిహాని కలిగించును. లౌకికవిద్యలు అహంకారము, ఆడంబరములకు మూలకారణము. వాటితోబాటు ఆధ్యాత్మిక సాధనలను కూడా అభ్యసించాలి. శీలమునుకూడ అభివృద్ధిగావించాలి. ఎవరికివారు నీటిమీద బొట్టువలె జీవించేందుకు ప్రయత్నించరాదు. సహాయము, సహకారము సేవాబుద్ధితో ఎట్టి సాహసకార్యమునైననూ సాదింఛవచ్చును. ఒక దారము చీమను కూడ బంధించలేదు. అయితే, కొన్నివేల దారములు చేరి ఏనుగును బంధిస్తాయి కదా! ఐకమత్యమే సద్గుణం. మనం కోపరేషన్ అంటున్నాముగాని జరుగుతున్నది కోపరేషన్‌కాదు ఆపరేషన్ మాత్రమే! దానివలన సమాజమందు శాంతిభద్రతలు నిలువవు. యూనియన్ స్థాపించటమువలన యూనిటీ కుదరదు. కాగితాలలో చేరవచ్చు, కర్మలో చేరటములేదు.

సదస్సుల, సమావేశముల ఫలితమేమిటి? కోట్లను వ్యయముచేసి, సభ్యుల సమయము వ్యర్థముగావించి తీసుకున్న నిర్ణయాలు కేవలం గాగితంపైననే నిలిచిపోతున్నవి. ఆచరణలో కనిపించటము లేదు. గ్రామగ్రామాలు పర్యటించి కొత్తభావాలను, విధానాలను అందించేందుకు కంకణం కట్టుకోవాలి. మీ స్టడీసర్కిల్ ద్వారా కొన్ని విషయాలను పరిశీలించి ఆ ఫలితాలను జగత్తులో వ్యాప్తిజేయాలి. ఇతరులకు ఉపకరించే విషయాలను చర్చించి పరిశోధన సల్పాలి. తరగతులలో వెనుకబడిన విద్యార్థులకు, పేదవారికి సహాయంచేసి లోకకల్యాణమునకై కృషిచేయాలి.

మేఘములు మింటిపైనను మెదలుచుండ
వాటి దాపున విద్యుత్తు వరలునట్లు
విద్య వెనుకను జ్ఞానంబు వెలయవలయు
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు.

మేఘాలు ఆకాశములో మెదలుచుండగా వాటిమధ్య విద్యుత్తు మెరసినట్లు విద్యలోపల జ్ఞానము ప్రకాశించాలి. విద్యావంతుని జీవితమే ఇతరులకు ఒక సందేశముగా మారిపోవాలి. మీ శక్తులను, సామర్థ్యములను, గుణములను, పవిత్రతు, రక్తాన్ని ఈ ఆశయ సాధనకై ధారపోయాలి.

అంధకారంబెల్ల హతమారునేచూడ
వసుధలో దీపంపు వార్త వలన
ఆకొన్న వారికి ఆకలి తీరునే
పంచభక్ష్యపు పేర్లు పరగ విన్న
నిరుపేదవాని పేదరికంబు పోవునే
విత్త ప్రభావంబు విన్నయంత
రోగపీడితుని బల్ రోగాలు పోవునా
ఔషధ మహిమము అంతవిన్న
శాస్త్రజాలంబునంతయు చదివినంత
దట్టమైనట్టి అజ్ఞాన తమము తెగున
ఆచరణలేని విద్యలు అవనియందు
దండి నేర్చిన ఫలమేమి? గుండుసున్న.

ఔషదం పేరు చెబితే రోగం నయమగునా? డబ్బు పేరు చెబితే పేదరికం పోవునా? పంచభక్ష్య పరమాన్నముల పేరు చదివితే ఆకలి తగ్గునా? వాటిని అనుభవించినప్పుడే ఫలితం కలుగుతుంది. విద్యారంగములో చెలరేగుచున్న సమస్యలకు కారణమేమిటని పరిశీలించి పరిహారసూత్రములను అనుసరించి ఆచరణ సలపాలి. విద్యావిదానములో ఉపాధ్యాయులు ట్యాంక్ వంటివారు. విద్యార్థులు ట్యాప్స్ వంటివారు. ట్యాంక్‌లో మంచినీరు నిండియుంటే ట్యాప్స్‌లో మంచినీరు వస్తుంది. తమలోని దోషాలను నిర్మూలముచేసి, విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేది అధ్యాపకుల కర్తవ్యము. విద్యయొక్క అంథరార్థము ఇది. సంకుచిత, స్వార్థ భావాలు లేకుండా విసాలమైన పరార్థభావాలను పోషించి పెంచుకోవాలి.

అందరూ ఒక్కటే అన్న ఏకత్వభావాన్ని దృఢపరచుకోవాలి. 'ఈశావాస్యమిదం సర్వం' 'వాసుదేవమిదం సర్వమ్' 'ఈశ్వరస్సర్వభూతానామ్' అని ఉపనిషత్తులు బోధిస్తున్నాయి. తమ పిల్లలవలె ఇతర పిల్లలను ఆధ్యాపకులు వాత్సల్య దృష్టితో ఆదరించాలి. రసాయనశాస్త్రముతోబాటు వారికి దైవరసాన్ని కూడ అందించాలి. ఫిజిక్స్‌తోబాటు ఫిలాసఫీనికూడ బోధించాలి. వృక్షశాస్త్రముతోబాటు జీవితవృక్షాన్ని గురించి తెలపాలి. అర్థశాస్త్రమును బిధించే సమయమందు, దానితోబాటు ఆధ్యాత్మిక శాస్త్రమును తెలుపాలి. ఈ జీవితం ఒక వృక్షము. ఇక్కడ మనము పెంచుకొనే బంధుత్వాలు దాని కొమ్మలు, రెమ్మలు. మన ఆలోచనలే పుష్పాలు. ఆ వృక్షముయొక్క ఫలమే ఆనందము. ఆ పండులోని తియ్యని రసమే సచ్ఛీలం. వృక్షముయొక్క వేర్లు ఆత్మవిశ్వాసము.

ప్రస్తుత విద్యారంగములో ఆత్మవిశ్వాసమనే వేర్లు లేవు. సచ్ఛీలమనే మధుర రసమూ లేదు. ఇంతేగాక, క్రమశిక్షణ బాగా లోపించినది. చెప్పుట ఒకటి, చేయుట మరొకటి, ఆలోచించుట మరొకటి జరుగుచున్నది. దేహాన్నికాదు మానవత్వమును, మానవుని మాధవునిగా మార్చే సత్యము ధర్మము శాంతి ప్రేమ వీటిని బలపరచి అభివృద్ధిగావించుకోవాలి. ఇదే విద్యాసంస్థలయొక్క గురి, విద్యాభ్యాసముయొక్క సార్థకత.